# నేనే గెలిచాను తాతయ్యా

దీపిక దూకుడుగా బైటినుంచివచ్చి కాలిచెప్పులు ఈమూల ఒకటీ ఆమూల ఒకటీ పడేటట్టుగా విసిరింది. ముఖమ్మీద చిరాకూ, అలకా, రోషమూ, అభిమానమూ కొట్టవచ్చినట్టు కనపడుతున్నాయి.

"దీపా, ఎక్కడికెళ్లావమ్మా ఈ సమయంలో? నీకోసం భోజనంవేళయినా కనిపెట్టుకుని కూర్చున్నాను. రా - భోజనం చేద్దాం" శివరావు బల్లదగ్గర కూర్చున్నాడు.

నిజానికి దీపికకు ఆకలిగానే ఉంది. ఒంటిగంట దాటిపోయింది. మనసు చికాకుపెట్టటంతో భోజనం చెయ్యాలని లేదు. కాని తాతయ్యను ఈ వయసులో యింకా భోజనం చెయ్యకుండా ఆపటం మంచిదికాదని వచ్చి కూర్చుంది.

శివరావుకు దీపను చూడగానే ఏదో బెడిసిందనిపించింది. అయినా తను ముందుగా అడిగితే రెచ్చగొట్టినట్లవుతుం దనుకున్నాడు.

"ఎక్కడికెళ్ళావమ్మా? చూడు - భోజనానికి ఎంత ఆలస్యమయిందో?" అన్నాడు శివరావు.

"అదే తాతయ్యా, నాలుగుసార్లు మనింటికి వచ్చాడు సరదాగా మాట్లాడాడు కదా అని ఆ శ్యామ్ కాఫీ టిఫిన్‌కు పిలిస్తే వెళ్లాను. ఏంమనిషో? ఆ ఉద్యోగానికీ, హోదాకూ తగినట్టుండడు. ఏమిటో పాతమాటలు మాట్లాడతాడు. మొత్తానికి పల్లెటూరి వేషమూ ఆమాటా చూస్తే ఇతడింత ఉద్యోగం ఎలా చేస్తున్నాడా అనిపిస్తుంది

"ఏం మాట్లాడాడమ్మా నీతో?"

"ఆఁ ఏంమాట్లాడుతాడు? తన పల్లెటూరితనం పోనిచ్చుకున్నాడు కాదు. అంతా ఛాందసం. ఏమని చెప్పను?" విసుక్కుంది.

"అదేమిటమ్మా? అతడిని నువ్వే ముందు చూశావు. అతడి హోదా-ఉద్యోగమూ నీకు నచ్చాయన్నావు. మీ ఇద్దరి భావాలూ కలిశాయన్నావు. అమ్మకూ, నాన్నకూ ఉత్తరం రాయమన్నావు. ఇంతలోకి ఏమయింది? కట్నం కావాలన్నాడా ? అంటే చెప్పు? ఇద్దాం దానికేముంది?"

"కట్నం కాదు తాతయ్యా. ముందీ మాట చెప్పు ? బామ్మ చీరెలు కట్టుకునేదా ?"

"అదేం ప్రశ్న దీపా? బామ్మ చీరెలే కట్టుకునేది. పైగా నన్ను కొనుక్కు-రమ్మనేది. మీ అమ్మ కూడా చీరెలే కట్టుకుంటుంది కదా?"

"అవునులే తాతయ్యా, శ్యామ్‌కేదో పెద్దఉద్యోగమని పైచూపులు చూస్తున్నట్లనిపిస్తుంది. అదో పెద్ద ఉద్యోగమా ? చెప్పు తాతయ్యా?'

"కాదుటమ్మా? అంత ఉద్యోగం అందరికీ వస్తుందా ?"

"ఆ చదువు చదివితే నాకూ వస్తుంది. ఇంతకూ ఆ ఉద్యోగం చాలా గొప్పదంటావు?"

"కాదుటమ్మా? అది అతడి అదృష్టం. అవునుగాని ఇందాకా చీరెలసంగతి ఎత్తావు ఎందుకు ?"

"అదికాదు తాతయ్యా, నేనుటా చీరె కట్టుకోవాలటా? తలవెంట్రుకలు రిబ్బనులో బంధించుకోవాలట. ఇదేమిటి తాతయ్యా ? నా వేషధారణమీద తనపెత్తనమేమిటంట? అయినా నాజోలి తనకెందుకు ?"

శివరావుకు నవ్వు పెదవులమీదికి రాబోయింది. కాని నిగ్రహించుకున్నాడు. నవ్వితే దీప ఆగ్రహం మరింత హెచ్చుతుంది.

"దీపా, మీ అమ్మ చాలా బాగా పాడుతుంది కదూ? ఫిడేలు బాగా వాయిస్తుంది. పాటకచేరీలు కూడా చేస్తుంది. ప్రెసిడెంటు వచ్చినప్పుడు అమ్మ పాట పాడేది. ఆయనకూడా గంటలకొద్దీ వింటూ కూర్చునేవాడు."

"ప్రెసిడెంటు కూర్చుని వినటంకూడా గొప్పేనా? అదొక సర్టిఫికెట్టా?''

"ఆమాటక్కాదమ్మా నేను చెప్పేది. అమ్మ గొంతు బాగుంటుందని నాన్న

సంగీతం నేర్చుకోమన్నాడు. నాన్న కిష్టంకదా అని అమ్మ నేర్చుకుంది, తప్పేమి టమ్మా. ఒకరి కిష్టమైనపని ఇంకొకరు చేస్తే?''

"ఎందుకు చెయ్యాలి తాతయ్యా ?"

''ఎందుకేమిటమ్మా, మీ బామ్మ నాకిష్టమైన వంటకాలే చేసేది."

''బామ్మ కిష్టమైన వంటకాలు నీవు తిన్నావా తాతయ్యా ?"

"నాకిష్టమైనవి తినటమే బామ్మకూ ఇష్టమేననేది."

"పెళ్ళంటే ఇదేనా తాతయ్యా ? మనసును చంపుకోవటమేనా? ఛీ.ఛీ."

"అట్లా అనకు తల్లీ. ఒకరి ఇష్టాన్ని ఒకరు గౌరవించటంలో ఉన్న ఆనందం మరోదానిలో ఉంటుందటమ్మా ?''

''సర్లే తాతయ్యా, అందరూ ఇదే మాట ఏనోట విన్నా ఇదే పాట" విసురుగా లేచింది దీప.

దీప తండ్రి, ఆమె వచ్చిన తరువాత ఒక్క ఉత్తరమైనా రాయలేదు.

''తాతయ్యా, నాన్నెందుకు ఉత్తరం రాయలేదు? నేను అమ్మకు రెండు కవర్లు రాశాను. ఏమిటో అందరూ మారిపోతున్నారేమిటి ? వాళ్ళిద్దరికీ నామీద కోపం వచ్చే ఉంటుంది. నన్నుగురించి నీకేమీ ఉత్తరం రాలేదా తాతయ్యా ?"

"లేదమ్మా, వస్తే నీకు చూపించనా ?''

"ఏమోలే తాతయ్యా. మా నాన్న తండ్రివేగా నీవు?"

"పిచ్చిపిల్లా. తండ్రినయినంత మాత్రాన వాడి మాటలన్నీ నమ్ముతానా?"

మనసు మళ్ళించుకోవటానికి దీప నవలలు చదవటం మొదలుపెట్టింది. లైబ్రరీనుంచి సాయంత్రమొకటీ పొద్దున ఒకటీ తెస్తోంది.

బి. ఏ. ప్యాసయిన దీప ఇక కాలేజీచదువు మరి చదవనని మొండికేసింది. టైప్‌రైటింగ్, షార్టుహ్యాండ్ అసలే వద్దంది. పెళ్ళిసంబంధాలు రెండేళ్లనుంచీ చూస్తున్నారు తల్లీతండ్రీ. కాని- అన్నిటికీ అన్నివంకలూ పెట్టింది. అసలు ఆమె మనసులో ఏముందో- ఏంచెయ్యాలనుందో- వాళ్ళకర్థంకాలేదు. తండ్రి ఒంటరిగానే

ఉంటున్నాడు. ఆయన దగ్గరికి పంపించారు- వీలుగాఉంటే ఏదయినా సంబంధం చూసి దీపకు నిశ్చయం చెయ్యమని.

శివరావు కూడా ఆ ప్రయత్నం మీదనే ఉంటున్నాడు. శ్యాం ఆఫీసరుగా సెలక్టయాడు. మంచి ఉద్యోగం. మంచి జీతం. దీపకు తీసిపోని అందం. అన్నిటి కన్నా మించి సౌమ్యుడు. స్నేహశీలి. తాతగారి యింటికి వస్తున్న శ్యాంతో దీపిక చనువుగా మాట్లాడడం, కాఫీ టిఫిన్‌లు ఇవ్వటం, అప్పుడప్పుడు సినెమాల కెళ్లటం జరుగుతోంది.

''దీపా, నీకు శ్యాం నచ్చాడా అమ్మా?'' అడిగాడు శివరావు.

''శ్యాం అటువంటి మంచి మనిషిని నేనెక్కడా చూడలేదు తాతయ్యా'' అన్నది.

"అయితే నిశ్చయం చేయమంటావా ఏమిటి ?"

''నీ యిష్టం తాతయ్యా.''

అంతవరకూ వచ్చిన వ్యవహారం, దీపికకు అతడితో అభిప్రాయభేదం ఇప్పుడు వచ్చింది. విసుక్కుంది. అతడిమీద అలిగింది. పల్లెటూరివాడని హేళన చేసింది. తాతయ్యదగ్గర అతడిమీద నేరాలు చెప్పింది.

శివరావు భయపడ్డాడు. ఇంతవరకూ వచ్చిన వ్యవహారం చేజారిపోతుం దేమోనని. అయినా పైకి ఏమీ మాట్లాడలేదు.

వారంరోజులు బరువుగా గడిచాయి. దీపికలో ఇప్పుడు ఉత్సాహం లేదు. ముఖమ్మీద నవ్వులేదు. నవలలు చదవటం కూడా మానేసింది. మంచమ్మీద ఏదో ఆలోచిస్తూ పడుకుంటోంది. సరిగా భోజనం కూడా చెయ్యటంలేదు.

తాతగారు చూస్తూ ఊరుకుంటున్నారు.

రోజూ తెల్లవారినట్లే ఆనాడూ తెల్లవారింది. కాఫీ టిఫిన్‌కోసం బల్లదగ్గర కూర్చుని దీపకోసం ఎదురుచూస్తూ పత్రికను తిరగవేస్తున్నాడు. కొంతసేపు చూసి దీపను పిలవమని నౌకర్ను పంపాడు శివరావు.

''అమ్మాయిగారు లేరండి'' నౌకరు చెప్పాడు.

శివరావు సుబ్బమ్మను చూసిరమ్మన్నాడు.

సుబ్బమ్మ ఆ యింట్లో పేరుకు వంటమనిషే గాని ఇంటిమనిషికంటె ఎక్కువగా చూసుకుంటుంది. దీపకోసం ఇల్లంతా వెతికి నీళ్ళగది కూడా చూసి వచ్చింది.

"అమ్మాయి పొద్దున్నే లేచి స్నానం కూడా చేసినట్టుందండీ. ఎక్కడికి వెళ్ళిందో ?''

''ఈ ఊర్లో ఒకరో యిద్దరో స్నేహితులు దొరికారులే. అక్కడికి వెళ్ళిం దేమో?" అన్నాడు శివరావు.

"మీరు కాఫీ టిఫిన్ తీసుకోండి. అమ్మాయి వస్తుందిలెండి. మీరెందుకు కాచుకుని కూర్చోవటం ?" సుబ్బమ్మ ఆయనకు కావలసినవి బల్లమీద అమ ర్చింది.

శివరావుకూ మనసులో దిగులుగా ఉంది. స్నానంచేసివచ్చి పడక్కుర్చీలో కూర్చుని ఆలోచిస్తూ పత్రిక చేతపట్టాడు.

పదీ-పదకొండు గంటలు దాటిపోయాయి. ఒంటిగంట కూడా దాటుతోంది. సుబ్బమ్మ వంటయింట్లో చిన్న పీట తలకింద పెట్టుకుని పడుకుంది.

రెండుగంటల సమయాన దభాలున తలుపులు తోసుకుంటూ దీప లోప లికి వచ్చి ''తాతయ్యా, ఎవరొచ్చారో చూడు.'' అంటూ ఆయనను లేపింది.

పసుపంచు ఆకుపచ్చ పట్టుచీర కట్టుకుని, తలవెంట్రుకలను రిబ్బనుతో బంధించుకుని, చేమంతి పువ్వొకటి దానిమీద పెట్టుకుని ఆనందంతో వెలిగి పోతున్న ముఖంతో దీప-ఆమె వెనుక శ్యాం.

దిగ్భ్రాంతుడై చూశాడు వాళ్ళిద్దరినీ శివరావు. "రండి-రండి" మీకోసమే చూస్తున్నాను. భోజనానికి పదండి" అంటూ శివరావు లేచి వాళ్ళిద్దరినీ భోజనాల బల్లదగ్గరకు తీసుకువచ్చి ''సుబ్బమ్మా" అన్నాడు.

ఆమె వడ్డనప్రయత్నంలో ఉండగా దీప "తాతయ్యా నాకీ చీర రంగు బాగుందా? శ్యాంకెంతో ఇష్టంట ఈరంగంటే. బజారుకెళ్ళి కొనుక్కొచ్చాడు. నేను వెంటనే కట్టుకున్నాను. ఇద్దరం గుడికెళ్ళి వస్తున్నాం తాతయ్యా. అయినా నీవెందుకు నాకోసం భోజనం చెయ్యకుండా ఆగటం? నీవు తినాల్సింది. ఇలా చేశావేమిటి తాతయ్యా?"

కొండంత బరువు తలమీదినుంచి దిగినట్టుగా తేలికపడిన మనసుతో "అమ్మా దీపా. నీవు మంచి కబురు తెస్తావని నాకు తెలుసు. అది చెవిన వేసుకుని భోజనం నీతో చెయ్యాలని ఆగానమ్మా. శ్యాంను కూడా తీసుకువచ్చావు. హాయిగా కబుర్లుచెప్పుకుంటూ భోజనం చేద్దాం" అన్నాడు శివరావు.

"తాతయ్యా. చూశావా? నీవు శ్యాం సంబంధం తప్పిపోతుందనుకున్నావు కదూ? ఓడిపోయావు నేనే గెలిచాను" అంటూ చప్పట్లు కొట్టింది దీప.

వాళ్ళు మాట్లాడుతూ ఉండగానే సుబ్బమ్మ పాయసం చేసి భోజనం వడ్డించింది.

వాళ్ళిద్దరినీ చూడగానే శివరావు కళ్ళముందర పెళ్ళిపందిరి-వేదమంత్రాలు-మంగళసూత్రాలు-సన్నాయిమేళం బొమ్మకట్టాయి.